నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, శనివారం 31 మే 2025 SIDDIPET



సిద్దిపేట జిల్లా దుబ్బాకలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# అన్నదాత అరిగోస

- జీలుగ విత్తనాల సరఫరాలో కాంగ్రెస్ పూర్తిగా విఫలం
- ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక,మే30: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో పలు కార్యక్రమాలకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన హాజరయ్యారు. మొదట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 150 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారులో అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాల కొనుగోళ్ల నుంచి ధాన్యం విక్రయించే వరకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రజా సమస్యలను పక్కన బెట్టి కాంగ్రెస్ నాయకులు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గ్రామాల్లో జీలుగ విత్తనాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం తడిసి మొలకెత్తినా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ వ్యవసాయరంగాన్ని పండుగలా మార్చితే , కాంగ్రెస్ ప్రభుత్వం దండగలా చేసిందని మండిపడ్డారు. జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి అధికారులతో ఒక సమీక్షా సమావేశం నిర్వహించకపోవడం దురదృష్టకరమన్నారు. వర్షాకాలం ప్రారంభమైనా సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టడం లేదని, దవాఖానల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేకపోవడంతో ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అనంతరం అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్‌లో పెద్దమ్మ దేవాలయ వార్షికోత్సవ పూజలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. దుబ్బాకలో పలువురి వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎనగుర్తిలో మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. దుబ్బాక వంద పడకల దవాఖానలో దంత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూపరింటెండెంట్ హేమరాజ్‌కు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రొట్టే రాజమౌళి, ఎల్లారెడ్డి ,కొత్త కిషన్‌రెడ్డి , కైలాశ్, కృష్ణ, శ్రీనివాస్, వంశీ, స్వామి పాల్గొన్నారు.



అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్‌లో పెద్దమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



సిద్దిపేట జిల్లా మర్కూక్‌లో చివరి దశలో ఐవోసీ భవనం పనులు

# అసంపూర్తిగా ఐవోసీ భవనాలు

- నిర్మాణాలపై దృష్టి సారించని ప్రభుత్వం
- బిల్లులు రావడం లేదని మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్లు
- ప్రజలకు ఒకే చోట ప్రభుత్వాధికారుల సేవలు అందని ద్రాక్షే
- ఇదీ సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో పరిస్థితి



సిద్దిపేట జిల్లా ములుగులో పిల్లర్ల దశలో నిలిచిపోయిన ఐవోసీ భవనం పనులు

గజ్వేల్, మే 30: ప్రజలకు ఒకే చోట ప్రభుత్వాధికారుల సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రానికి సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనాలు మంజూరు చేసింది. ప్రజలకు అవసరమయ్యే సేవలన్నీ ఒకే చోట అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ హయాంలో భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరుకాగా నమూనాగా గజ్వేల్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్(ఐవోసీ) నిర్మించాలని నిధులు మంజూరు చేశారు. అప్పట్లోనే భవనాల నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు బిల్లులు రావడం లేదని మధ్యలోనే వదిలేశారు.

## సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో...

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని ములుగు మండల కేంద్రంలో పిల్లర్ల దశలో వదిలేయగా, మర్కూక్ మండల కేంద్రంలో చివరి దశలో పనులు మిగిలి ఉండగా బిల్లులు రావడం లేదని అసంపూర్తిగా నిలిపివేశారు. జగదేవ్‌పూర్‌లో ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. వర్గల్ మండల కేంద్రంలో స్థలం లేక నిర్మాణ పనులు ప్రారంభించలేదు. కొండపాక మండల కేంద్రంలో రూ.7.12కోట్లతో పనులు పూర్తవడంతో ఒకే ఒక ఐవోసీ భవనం అందుబాటులోకి రావడంతో ప్రారంభించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఐవోసీ భవనాల నిర్మాణాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఒక్కో భవనానికి రూ.5 నుంచి రూ.10కోట్ల వరకు అంచనా వేసి మంజూరు చేశారు. ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో బిల్లులు సకాలంలో రాకపోవడంతో కాంట్రాక్టర్లు కొన్ని చోట్ల చివరి దశలో, మరికొన్ని చోట్ల పిల్లర్ల దశలో అసంపూర్తిగా నిలిపివేశారు. ఒకేచోట ఇంటిగ్రేటెడ్ భవనాలు అందుబాటులోకి వస్తే ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లోని సేవలు దగ్గరవుతాయనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం భవనాలకు నిధులు మంజూరు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భవనాల నిర్మాణాలు పూర్తి చేయించడంలో చొరవ చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే
# కేసీఆర్‌పై ఆరోపణలు

బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 30: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్ కుటుంబంపై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని, రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు జారీ చేశారని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కాలయాపన చేస్తూ కేసీఆర్, హరీశ్‌రావును ప్రజల్లో చులకన చేస్తూ మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొద్ది రోజుల్లోనే విఫమైందని, ఎల్‌అండ్‌టీ సంస్థ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే, నిర్ధారణ కాకముందే రాజకీయ దురుద్దేశంతోనే నోటీసులు జారీ చేశారన్నారు. ప్రాజెక్టుకు పెట్టిన వ్యయం రూ.94వేల కోట్లు అయితే అందులో లక్షకోట్ల అవినీతి జరిగిందని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రెండు లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టులు, కొత్త పథకాలను ఎక్కడా ప్రవేశపెట్టలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే చిత్తుగా ఓడిపోతామనే భయంతో కాంగ్రెస్ ముందుకురావడం లేదని, బీఆర్‌ఎస్‌నే ప్రజలు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు దోచుకుంటున్నారని, అవినీతి పెరిగిపోయిందన్నారు. ప్రభుత్వంలో ప్రజలకు భద్రత లేదని 20శాతం కమీషన్ కోసం కౌంటర్ ఏర్పాటు చేయాలని హితువు పలికారు. రూ.6వేల కోట్ల ప్రజాధనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆపార్టీ కార్యకర్తలకు పప్పు, బెల్లంలా పంచిపెడుతుందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పార్టీలతో సంబంధం లేకుండా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మర్కూక్ కరుణాకర్‌రెడ్డి, నవాజ్‌మీరా, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు జకీయొద్దీన్, నర్సింగరావు, రమేశ్‌గౌడ్, రమేశ్, సంతోష్‌రెడ్డి, యాదగిరి, కనకయ్య, మన్నె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ విఫలం

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



నర్సాపూర్, మే30: రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై అవలంబిస్తున్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తూ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొనుగోళ్లు సరిగ్గా జరగక రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని విమర్శించారు. కేంద్రాల వద్ద వ్యవస్థ సరిగ్గా లేక సమయానికి ధాన్యం కాంటాలు కావడం లేదన్నారు. అకాల వర్షం వల్ల ధాన్యం తడిసి అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కొరత తీవ్రమైన సమస్యగా మారిందన్నారు. భూమి సారవంతానికి అవసరమైన జీలుగ, జనుము విత్తనాలు అవసరమైన మోతాదులో అందుబాటులో లేవనే సమాచారం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నదన్నారు. రైతుల ఇబ్బందులు మా దృష్టికి రాగానే వెంటనే వ్యవసాయశాఖ సెక్రటరీ, కమిషనర్‌తో మాట్లాడడం జరిగిందని గుర్తుచేశారు. నర్సాపూర్ నియోజకవర్గానికి అవసరమైన విత్తనాలు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఇప్పటికే పలుమార్లు ఫోన్‌లో తెలియజేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని, కాంగ్రెస్ చేసే తప్పిదాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# అర్హులకు అందని ఇందిరమ్మ ఇండ్లు

- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై సంగారెడ్డి జిల్లా బొంతపల్లి మున్సిపల్ వార్డు ప్రజల ఆందోళన



సంగారెడ్డి జిల్లా బొంతపల్లి మున్సిపల్ వార్డు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

గుమ్మడిదల,మే 30: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదలకు అందడం లేదని మున్సిపాలిటీ వార్డు ప్రజలు ఆందోళన చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి మున్సిపల్ వార్డులో సుమారు 10 వేల జనాభా ఉంటుంది. ఇందులో ఆరు వేలకు పైగా ఓట్లు ఉన్నాయి. మొదటి విడతలో ఇందిరమ్మ కమిటీ ప్రమేయం లేకుండా ఒకే ఒకరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. శుక్రవారం శంకుస్థాపనకు వచ్చిన మండల అధికారులపై మున్సిపల్ వార్డులోని కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ సురభి నాగేందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి,గిద్దె రాజు, సురభి వినోద్‌గౌడ్, ఆలేటి సంజీవరెడ్డి, లక్ష్మీనారాయణ, గ్యారల మల్లేశ్‌ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వార్డులో 10 వేల మంది జనాభాలో అర్హులు ఒక్కరేనా..? అని ప్రశ్నించారు. అర్హులైన పేదలకు ఇండ్లు మంజూరు చేసే వరకూ ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన చేయరాదని నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీవో ఉమారాణి, మున్సిపల్ అధికారులు వెనుదిరిగారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే వరకు ఎలాంటి భూమి పూజ చేయరాదని మున్సిపల్ వార్డు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వీరితో పాటు ఉప్పనూతల వినయ,సుధాకర్, లక్ష్మణ్, శ్రీశైలం, సత్తారం ప్రభాకర్, తలుపుల శ్రీనివాస్, కూర శంకర్, మనీల, జాంగిర్‌బీ ఉన్నారు. కాగా ఎంపీడీవో ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ రఘు, ఆర్వోలు సంగీత, జీపీ సెక్రటరీ సంతోషా, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆయా గ్రామాల నాయకులు కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం, అన్నారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం శంకుస్థాపనలు చేశారు.



సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో మెగా హెల్త్ క్యాంపులో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

# ఉచిత వైద్య సేవలు అభినందనీయం

సదాశివపేట, మే 30 : ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని రవీంద్ర మోడల్ స్కూల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెగా హెల్త్ క్యాంపులోఎలాంటి పరీక్షలు చేస్తారని ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ఉచిత మెగా హెల్త్ క్యాంపును పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మించిన అధ్యా దవాఖానను నిర్వాహకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, విద్యాసాగర్‌రెడ్డి, చింతా సాయినాథ్, చీల మల్లన్న, డాక్టర్ కిశోర్, ఇంద్రమోహన్‌గౌడ్, మైనార్టీ నాయకుడు అక్బర్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, మే 30: కలిసికట్టుగా అందరం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. టీఎస్ యూటీఎఫ్ చేపట్టిన బడిబాట ప్రచారజాత శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రోజు రోజుకు విద్యార్థుల నమోదుశాతం తగ్గుతుందన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి నమోదు శాతం పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. ఎంతో మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని గొప్ప గొప్ప అధికారులు, నాయకులుగా ఎదిగారని వారిని స్ఫూర్తిగా తీసుకొని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ వలీఅహ్మద్, యాదగిరి, ఎంఈవో కృష్ణ, నాయకులు సత్యనారాయణ, చంద్రారెడ్డి, వెంకట్‌కిరణ్, ప్రభావతి, రవీందర్, రామచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, శివలింగం, ప్రశాంత్, కృష్ణ, పాషా, సక్రియా, సత్తయ్య, ఆదిలక్ష్మి, వెంకటేశం, రాజేందర్ పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి

ములుగు, మే 30 : ఉద్యాన పంటల సాగను ప్రోత్సహించాలని ఉద్యానశాఖ కమిషనర్ షేక్‌యాస్మిన్‌బాషా అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో వీసీ రాజిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎంఐడీహెచ్ ద్వారా రూ.145 కోట్లు ఉద్యానశాఖ అభివృద్ధికి కేంద్రం కేటాయించిందన్నారు. ఉద్యాన పంటల సాగు పట్ల ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇప్పించి సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించాలని ఆదేశించారు. పదేండ్ల నుంచి నేషనల్ సీడ్ సర్టిఫికేషన్ ద్వారా రైతులు విత్తనాలు కొనుగోలు చేయకపోవడంపై స్పందిస్తూ విత్తన క్వాలిటీని పరిశీలించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. మెరుగైన విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఉద్యాన పంటల సాగుకు సంబంధించిన డైరీని ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ చీనానాయక్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ లక్ష్మీనారాయణ, ఉద్యాన వర్సిటీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా ములుగులో ఉద్యాన పంటల సాగుకు సంబంధించిన డైరీని ఆవిష్కరిస్తున్న ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు

# మార్గం సుగమం

- ముమ్మరంగా బీదర్-నిజాంపేట్ జాతీయ రహదారి నిర్మాణం
- రూ.512 కోట్లతో కొనసాగుతున్న పనులు
- బీఆర్‌ఎస్ హయాంలో ప్రతిపాదన
- ప్రయాణికులకు తగ్గనున్న దూర భారం
- అంతర్రాష్ట్ర రవాణా సౌకర్యవంతం



సంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపూర్ గ్రామ శివారులో చురుగ్గా కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులు

జహీరాబాద్, మే 30: సంగారెడ్డి-నాందేడ్ 161 జాతీయ రహదారికి సంబంధించిన 45.96 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న బీదర్-నిజాంపేట్ 161బీ రహదారి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గంలోని నిజాంపేట్, నారాయణఖేడ్, మనూరు, న్యాల్‌కల్ మండలాల్లోని గ్రామాల మీదుగా బీదర్‌కు వెళ్లేందుకు కేంద్రం ఈ పనులు చేపడుతున్నది. 2017లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. అప్పటి ఎంపీ బీబీ పాటిల్ సైతం రోడ్డు నిర్మాణానికి కృషిచేశారు. అప్పట్లో బీదర్-నిజాంపేట్ రోడ్డును 50 జాతీయ రహదారిగా నిర్మించడానికి డిక్లేర్ చేశారు. కానీ, నిధులు మంజూరు చేయలేదు. దీంతో భూసేకరణ, పరిహారం తదితర అంశాల వల్ల ఆలస్యమైంది. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు రహదారి నిర్మాణానికి నిధుల మంజూరు చేయించాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం స్పందించి, 2022లో బీదర్-నిజాంపేట్ జాతీయ రహదారి నిర్మాణానికి రూ. 512.98 కోట్ల నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి-నాందేడ్ 161 జాతీయ రహదారిగా ఉండడంతో అనుసంధానంగా నిజాంపేట్-బీదర్ రోడ్డును 161బీ జాతీయ రహదారిగా గుర్తించారు.

## కొనసాగుతున్న పనులు

రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నిజాంపేట్ నుంచి బీదర్‌కు 60 కిలోమీటర్ల దూరం ఉండడంతో సంబంధిత శాఖాధికారులు తగుచర్యలు తీసుకుని రహదారికి చాలాచోట్ల మూల మలుపులు తగ్గిస్తూ 45.96 కిలోమీటర్ల దూరం రెండు లైన్లుగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఆయా నియోజక వర్గంలోని నిజాంపేట్, మూడుగంటలు, ర్యాలమడుగు, డీఎస్‌టీతండా, నారాయణఖేడ్, వెంకటపూర్, బాణాపూర్, జగన్నాథ్‌పూర్, పిప్రి, మనూర్, పూల్‌కుర్తి, రాఘవపూర్, చాల్కి, ఇబ్రహీంపూర్, న్యాల్‌కల్, ఆత్నూర్, డప్పూర్, మల్గి గ్రామాల పరిధిలో రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. జహీరాబాద్-నారాయణఖేడ్ నియోజకవర్గాలకు కర్ణాటక సరిహద్దుగా ఉండడంతో 161బీ నిజాంపేట్-బీదర్ జాతీయ రహదారి పూర్తయితే అంతర్రాష్ట్రరవాణాకు మార్గం సుగమం కానున్నది. ప్రజలు పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని బీదర్ జిల్లా కేంద్రానికిరాకపోకలు సాగించవచ్చు. జహీరాబాద్, నారాయణఖేడ్, బీదర్‌కు రాకపోకలు సాగించేందుకు గతుకుల రోడ్డుపై వెళ్లాలంటే గంటన్నర సమయం పట్టేది. కానీ, ఈ జాతీయ రహదారి నిర్మాణంతో అరగంటలోనే వాహనచోదకులు చేరుకునేందుకు వీలు కలుగుతుంది. జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే ఆయాప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉంది.